నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
## కర్నూలు | నంద్యాల
బుధవారం | 19 జూన్ 2024 | పేజీలు 16

# అహోబిలంలో ఘనంగా స్వాతి వేడుకలు


స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహెూబిలం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలోశ్రీ లక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన వేడుకలు ఘనంగా జరిగాయి. నల్లమల అరణ్యంలో వెలసిన నవనరసింహులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామున నుండే నవనారసింహులను దర్శించుకునేందుకు కాలినడకన తరలి వెళ్లారు. జ్వాలా,అహెూబిల, మాలోల క్రోడా, కారంజ భార్గవ, యోగానంద, చిత్రపట,పావన నరసింహస్వాములను దర్శించుకున్నారు.కాలినడకన స్వామిని దర్శించుకునే

మిగతా 2లో

- నేటి నుండి రెండు రోజులు ఉమ్మడి జిల్లాలో క్షేత్ర స్థాయి పర్యటన
- రబీలో 1,30,189 హెక్టార్లలో పంట నష్టం
- ప్రధాన నష్టం పప్పుశనగ పంటలకే
- కరవుకు శాశ్వత చిరునామాగా మారిన కర్నూలు జిల్లా పశ్చిమం
- వేదవతి, ఆర్డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టులకు మోక్షం వస్తుందా..?
- హెచ్ఎన్ఎస్ఎస్ నుండి చెరువులను నింపుతారా ?
- ఖరీఫ్ మొదలవుతున్న సమయంలో రబీ నష్టం అంచనాల వల్ల రైతుకు పరిహారం అందుతుందా?


ఆర్డీఎస్ ప్రాజెక్టు


వేదవతి ప్రాజెక్టు


గుండ్రేవుల ప్రాజెక్టు



కర్నూలు ,మేజర్న్యూస్ బ్యూరో :

## కరవు అంచనాకు
# కేంద్ర బృందం




రబీ సీజన్‌లో పంట నష్టం అంచనా వేసేందుకు కేంద్ర కరవు బృందం నేడు, రేపు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించబోతోంది. కేంద్ర కరవు బృందంలో ఐఏఎస్ అధికారి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్పెండిచర్ డైరెక్టర్ చిన్మయ్య గాట్మేర్, తాగునీరు, పారిశుద్ధ్యశాఖ డిప్యూటీ అడ్వయిజర్ (పిహెచ్) ఆషిస్‌పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదిర్శ అరవిందకుమార్‌సోని తదితరులు ఉన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై వరుణుడు కరుణించిన నేపథ్యంలో రైతన్నలు పంట పొలాల్లో దుక్కి దున్నేందుకు సిద్ధపడుతున్న సమయంలో కరవు బృందం పర్యటన రైతులకు ఊరటనిస్తుందా? అన్నది పెద్ద ప్రశ్నార్థకంగానే కనిపిస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో **31** మండలాలను అప్పటి ప్రభుత్వం కరవు మండలాలుగా గుర్తించింది. విభజిత కర్నూలు జిల్లాలో **18** మండలాలు, నంద్యాల జిల్లాలో **13** మండలాలను కరవు వాత పడ్డాయని ప్రభుత్వం ప్రకటించింది. **1,30,189** హెక్టార్లలో పంట నష్టం సంభవిస్తే, **128.87** కోట్ల రూపాయల పంట నష్టం సంభవించిందన్నది రికార్డులు చెబుతున్న మాట. వరుణుడు ముఖం చాటేసిన ఫలితంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ కరవు పరిస్థితులు నెలకొని రైతాంగం తీవ్రంగా నష్టపోయినా కేవలం **31** మండలాలనే కరవు మండలాలుగా గుర్తించడాన్ని ప్రతిపక్షాలు, రైతు సంఘాలు, రైతులు వ్యతిరేకించినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వం గుర్తించిన **31** మండలాల రైతాంగానికీ ఇప్పటి వరకు నష్టపరిహారం అందలేదు.

2లో

# బదిలీ ఉత్తర్వుల పై గంపెడాశలు

- ప్రధాన ప్రాంతాల పై అధికారులు గురి
- ఎమ్మెల్యేలను కలుస్తున్న అధికార యంత్రాంగం
- టీడీపీ అనుకూలంగా పని చేస్తామని భరోసా
- తెర పైకి అధికార ముద్ర అధికార యంత్రాంగం

**నంద్యాల,మేజర్‌న్యూస్ బ్యూరో :** రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. కొత్త ప్రభుత్వం కొలువు తీరింది. పాలనపై పట్టుబిగిస్తుంది. గత ప్రభుత్వంలో వైసీపీతో అంటకాగిన రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులను సాగనంపుతుంది. తాజా ప్రభుత్వం జిల్లాల స్థాయిలో ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులపై అధికార యంత్రాంగం గంపెడాశలు పెట్టుకోంది. తాజా ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకొని పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మంత్రులు,ఎమ్మెల్యేలను కలుస్తున్నారు.గత ఐదేళ్లుగా తెరమరుగైన అధికారులు

మిగతా 2లో


మంత్రిని కలిసిన డిఐఈఓ సునీత

# ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం

- ఉయ్యాలవాడ,ఆళ్లగడ్డల్లో అత్యధికం

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** ఉమ్మడి జిల్లాలో భారీ వర్గాలు నమోదవుతూనే ఉన్నాయి. సోమవారం రాత్రి నుండి మంగళవారం ఉదయం వరకు కర్నూలు, నంద్యాల జిల్లాలో భారీ వర్షాలు నమోదయ్యాయి. ఉయ్యాలవాడ, ఆళ్లగడ్డ, రుద్రవరం మండలాల్లో అతి భారీ వర్షాలు కురిసాయి. ఉయ్యాలవాడలో ఒక్కరోజే ఏకంగా 109.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, ఆళ్లగడ్డలో 102.2, రుద్రవరం మండలంలో 100.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ మూడు మండలాల్లో సగటున

మిగతా 2లో


వర్షం పడుతున్న ( ఫైల్‌ఫోటో)

## శిథిలావస్థలో తుంగభద్ర దిగువ కాలువ


2లో
తుంగభద్ర దిగువ కాలువ దృశ్యం

### గోవధ నిషేధ చట్టాన్ని
## ఎందుకు అమలు చేయడం లేదు


2లో
మాట్లాడుతున్న నందిరెడ్డి సాయిరెడ్డి

సూర్య



# కరవు అంచనాకు కేంద్ర బృందం

(మొదటి పేజి తరువాయి)

కర్నూలు జిల్లాలో 1,21,873 హెక్టార్లలో సాధారణ సాగు ఉండగా, 94,634 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. ఇందులో 18 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొనగా, 70,982 హెక్టార్లలో పంట నష్టం సంభవించింది. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 1,81,118 హెక్టార్లలో సాధారణ సాగు ఉండగా, 1,22,898 హెక్టార్లలో పంట సాగు చేశారు. 13 మండలాల్లో 59,207 హెక్టార్లలో పంట నష్టం సంభవించినట్లు అధికారులు గుర్తించారు. నంద్యాల జిల్లాలో 13 మండలాల్లో 36,389 హె క్టార్లలో పప్పు సెనగలు, 4,116 హెక్టార్లలో మినుములు, 2,076 హెక్టార్లలో పొగాగు, 12,908 హెక్టార్లలో జొన్న పంటలకు నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఆనాటి కరవును కళ్లకు కట్టినట్లు కరవు బృందానికి చూపించాలని రెండు జిల్లాలో ఉన్నతాధికారులు నిర్ణయించినా క్షేత్రస్థాయిలో దాన్ని చూపించడం సాధ్యమేనా? అన్నది అనుమానంగానే ఉంది. నంద్యాల జిల్లాలోని తమ్మరాజుపల్లె వాటర్‌స్కీం, కోయిలకుట్ల మండలంలోని భీమునిపాడు, ఉయ్యాలవాడ మండలంలోని హరివరం గ్రామాల్లో కేంద్ర కరవు బృందం పర్యటించబోతోంది. అలాగే కర్నూలు జిల్లాలో మద్దికెర, చిప్పగిరి, ఆలూరు మండలాల్లో కేంద్ర కరవు బృందం పర్యటించబోతోంది. ఆయా మండలాల్లో కందిపంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 71,055 మంది రైతులు 73.871 హెక్టర్లలో పప్పుశనగ పంటలు నష్టపోగా, 22,014 హెక్టార్లలో జొన్న సాగు చేసిన 22,777 మంది రైతులు, 5,676 హెక్టార్లలో పొగాకు సాగు చేసిన 5,544 రైతులు, 5,549 హెక్టార్లలో మొక్కజొన్న సాగుచేసిన 4,299 మంది రైతులు, 4,891 హెక్టార్లలో మినుము సాగు చేసి 5,864 మంది రైతులు, 2,772 హెక్టార్లలో వేరుశనగ సాగు చేసిన 2,773 మంది రైతులు, 1,207 హెక్టార్లలో కొర్ర పంట సాగు చేసిన 1,216 మంది రైతులు నష్టపోయినట్లు ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ గుర్తించింది.

**జిల్లా పశ్చిమ ప్రాంతం...కరవుకు చిరునామా :** ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పశ్చిమ భాగం... ప్రస్తుత విభజిత కర్నూలు జిల్లా మొత్తం కరవుకు చిరునామాగా మారిపోయింది. జిల్లాలో వ్యవసాయం చినుకు మీదనే ఆధారపడి ఉంది. సకాలంలో వర్షాలు కురిస్తే పంటలు చేతికి రావడం లేదా రైతన్నలు నష్టపోవడం అన్నది ఈ జిల్లాకు పరిపాటిగా మారింది. చేసేందుకు పని లేక లక్షలాది మంది రైతులు, రైతు కూలీలు ఈ పశ్చిమ ప్రాంతం నుండి వివిధ రాష్ట్రాలకు వలస వెళ్లడం ఆనవాయితీగా మారింది. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం మీదుగానే తుంగభద్ర నదీ పరవళ్లు తొక్కుతూ కృష్ణమ్మ ఒడిలో కలిసిపోతున్నా సాగునీరిచ్చే ప్రాజెక్టులు లేక రైతన్నలు విలవిలలాడిపోతున్నారు. ఆర్డీఎస్, వేదవతి లాంటి ప్రాజెక్టులకు గత ప్రభుత్వాలు శ్రీకారం చుట్టినా అవి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారాయి. 2019 ఎన్నికలకు ముందు అప్పటి తెదేపా ప్రభుత్వం వేదవతి, ఆర్డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు విడుదల చేస్తూ జీఓలు ఇచ్చింది. అయితే, 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదు. ఇప్పుడు మళ్లీ తెదేపా అధికారంలోకి వచ్చింది. మరి కొత్త ప్రభుత్వం వీటిపై దృష్టి పెడుతుందా? చూడాలి. అలాగే గురురాఘవేంద్ర ప్రాజెక్టు మూలనపడింది. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ నుండి పశ్చిమ ప్రాంతంలోని వందకు పైగా చెరువులను నింపుతామని తెదేపా ప్రభుత్వం ప్రకటించి పనులు ప్రారంభించినా అవి పూర్తి కాలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం చెరువులను నింపేస్తామని ప్రకటించినా కార్యక్షేత్రంలో అది జరగలేదు. వైకాపా ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉన్న బుగ్గన రాజేంద్రనాథ్ చెరువులను నింపే పనులు పూర్తయ్యాయని, త్వరలోనే చెరువులను నింపేస్తామంటూ చేసిన ప్రకటనలు అటకెక్కాయి. మరి ఇప్పుడు మళ్లీ తెదేపా ప్రభుత్వం రావడంతో రైతుల్లో కొత్త ఆశలు కనిపిస్తున్నాయి. జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి చెందిన ఆలూరు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు సాగునీటిని అందించే ప్రాజెక్టులు చేపట్టకపోతే ఎప్పటికీ కరవు పరస్థితులు ఇలాగే కొనసాగుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

# అహోబిలంలో ఘనంగా స్వాతి వేడుకలు

(మొదటి పేజి తరువాయి)



పావన వరాహ అహోబిల యోగానంద తదితర క్షేత్రాలలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దిగువ అహోబిల అద్దాల మండపంలో ఉత్సవ మూర్తులైన శ్రీ ప్రహల్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు, అర్చక బృందం ప్రత్యేకపూజలునిర్వహించారు. అనంతరం అందరం స్వామి వాళ్ళ ఎదుట సుదర్శన హెూమం వేదమం త్రాలు మధ్య నిర్వహించారు. హెూమంలో పాల్గొన్న భక్తులందరికీ కాటుకను, హెూమరక్షలను అందజేశారు. వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం

(మొదటి పేజి తరువాయి)

10 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఈ సీజన్‌లో ఉయ్యాలవాడ మండలల్లో 254 శాతం మేర అధికారంగా వర్షపాతం నమోదైంది. 63 మిల్లీమీటర్ల సాధారణ వర్షం కురవాల్సి ఉండగా, 223.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే, ఆళ్లగడ్డలో 128శాతం, రుద్రవరంలో 251శాతం, మహానందిలో 211, దొర్నిపాడులో 298శాతం అధికంగా వర్షాలు నమోదయ్యాయి. పాణ్యం మండలంలో ఏకంగా సాధారణ సగటు వర్షాన్ని మించిన 469శాతం అధికంగా వర్షాలు నమోదవడం విశేషం. కర్నూలు జిల్లాలో మాత్రం సాధారణ వర్షపాతం నమోదైంది. నందవరం, ఎమ్మిగనూరు, కోడుమూరు మండలాల్లో స్వల్పంగా వర్షం కురిసింది. జూన్ నెలలో సగటున 77.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావలసి ఉండగా, ఇప్పటి వరకు 131.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

# శిథిలావస్థలో తుంగభద్ర దిగువ కాలువ

- **ఎల్లెల్సీ, పిల్ల కాలువలలో పేరుకుపోయిన పూడిక, ముళ్లకంపలు, చెత్తా చెదారం**
- **ఏళ్లు గడుస్తున్నా మరమ్మత్తులకు నోచుకోని కాలువలు**
- **చివరి ఆయకట్టు భూములకు సాగునీరు ఎలా వచ్చేది? అని రైతన్నల దిగులు**
- **పట్టించుకోని ఇరిగేషన్ శాఖ అధికారులు**

**పెద్దకడబూరు, మేజర్ న్యూస్ :** రేయనకా.. పగలనకా కాయాకష్టంతో తమ రెక్కలను ముక్కలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న వేలాదిమంది రైతన్నల ఆశలను మోసుకెళ్లే తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), దాని పిల్ల కాలువలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ముఖ్యంగా పెద్దకడబూరు మండల పరిధిలో ప్రవహిస్తున్న కాలువలలో పూడిక, ముళ్ల కంపలతో నిండిపోయి చెత్తా చెదారం పేరుకుపోయింది. దీంతో కాలువలో ఎగువ నుంచి వచ్చే నీటి పారుదలకు తీవ్ర అడ్డంకిగా మారింది. కాలువల ఇరువైపులా ఉన్న గట్లు కాంక్రీట్ లైనింగ్ పగుళ్లిచ్చాయి. ఫలితంగా పైనుంచి నీరు వదిలినప్పుడు లీకయ్యి నీరు వృధాగా పారుతుంది. ఇదిలా ఉండగా.. కిలోమీటర్ల మేర కాలువలు మరమ్మతులకు నోచుకోక చాలాచోట్లా దెబ్బతిని ఉన్నాయి. అంతేకాకుండా కాలువల గట్లు ధ్వంసమైన లైనింగ్?లకు కాస్త కాంక్రీట్ వేసే గతిలేని పరిస్థితిలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా.. శిధిలమైన ఎల్లెల్సీతో పాటు పిల్ల కాలువలకు కనీస మరమ్మతులు చేయించే దిక్కులేని స్థితిలో ఇరిగేషన్ శాఖ అధికారులు ఉన్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలువల వైపు చూస్తుంటే కన్నీళ్లు తప్ప..సక్రమంగా తమకు సాగునీరుపారేలా కనిపించడంలేదని రైతులు వాపోతున్నారు. వేలాది ఎకరాలను తడపాల్సిన సాగునీటి కాలువలు ఇలా దయనీయంగా మారిపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కాలువల మరమ్మతులు చేపట్టాలని ఇక్కడి రైతాంగం కోరుతోంది. ఎలాంటి అడ్డంకుల్లేకుండా చివరి ఆయకట్టు భూముల వరకు సక్రమంగా సాగునీరు అందేలా చూడాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# గోవధ నిషేధ చట్టాన్ని ఎందుకు అమలు చేయడం లేదు

- **విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి**

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:**

గోవధ నిషేధ చట్టం ఉన్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని, హిందువుల మనోభావాలకు ఎందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్ర అధ్యక్షుడు నందిరెడ్డిసాయిరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని వీహెచ్‌పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందువుల మనోభావాలకు వ్యతిరేకంగా కొందరు మతస్తులు గోవులును వధించి భుజిస్తున్నారన్నారు. భారతదేశం సనాతన ధర్మాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. దేశంలో గోహత్యను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి గోవధలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలని, గోవులను రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షుడు మద్దిలేటి, జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ పాల్గొన్నారు.

# బదిలీ ఉత్తర్వులపై గంపెడాశలు

(మొదటి పేజి తరువాయి)

అధికార మార్పిడితో తెరపైకి వస్తున్నారు. తమకున్న పాత పరిచయాలతో ప్రజాప్రతినిధులను కలుస్తున్నారు. టిడిపికి అనుకూలంగా పని చేస్తామని భరోసాను కల్పిస్తున్నారు. ప్రధాన నగరాలు, పట్టణాలపై ఉన్నతాధికారులు మొదలుకొని అధికారుల, ద్వితీయ, తృతీయశ్రేణి ఉద్యోగులు గురి పెట్టారు. తమ పోస్టింగ్‌లపై హామీ కోసం శ్రమిస్తున్నారు. ఎన్నికల సమయంలో పొరుగు జిల్లాల నుంచి వచ్చిన అధికారులు సైతం జిల్లా అధికారులతో పోటీ పడుతున్నారు. గత ప్రభుత్వ హయంలో అణిచివేతకు గురైన వారిని గుర్తించాలని అధికార యంత్రాంగంలో ఒక వర్గం తమ నినాదాన్ని వినిపిస్తుంది. గత ప్రభుత్వ హయంలో మంచి స్థానాల్లో పని చేసిన అధికారులు తిరిగి జిల్లా, నియోజకవర్గాల్లో మంచి స్థానాలను కోరుతుండటంతో ప్రజాప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మధ్యస్థంగా పని చేసిన అధికారులు తమ సేవలను గుర్తించాలని కోరుతున్నారు. జిల్లాలో ఎమ్మెల్యేల కార్యాలయాలు అధికార యంత్రాంగం కలయికలతో కిటకిటలాడుతున్నారు. ప్రధానంగా జిల్లా కేంద్రంలో పని చేసేందుకు ఉన్నతాధికారులు, అధికారులు ఇష్టపడుతున్నారు. వివరాల్లోకి వెళితే..

ప్రభుత్వాలు మారినప్పుడు జిల్లా స్థాయిలో ఉద్యోగుల బదిలీలకు శ్రీకారం చుడుతోంది. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బదిలీల ఉత్తర్వులు



మంత్రిని కలిసిన మార్క్‌ఫెడ్ మేనేజర్ నాగరాజు

వెలువడిన తరువాత ప్రక్రియ మొదలవుతోంది. ఈ సమయంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలను అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున కలుస్తోంది. నంద్యాల జిల్లాగా మారిన తరువాత జిల్లా స్థాయి అధికారులు తమ స్థానాల కోసం ప్రయత్నాలను ముమ్మరం చేశారు. గత ప్రభుత్వం ఏర్పడినప్పుడు అంతకు ముందు టిడిపి ప్రభుత్వంలో పని చేసిన జిల్లా స్థాయి అధికారులు ఎక్కువ శాతం పొరుగు జిల్లాకు వెళ్లారు. ఆ జిల్లా స్థాయి అధికారులు తిరిగి కొత్త జిల్లాకు వచ్చేందుకు ఇష్టపడుతున్నారు. కీలకమైన ప్రభుత్వశాఖల



ఎట్టకేలకు మంత్రి ఫరూక్‌ను కలిసి జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి

ఉన్నతాధికారులు ఒకే స్థానం కోసం ఇద్దరు ముగ్గురు పోటీ పడుతున్నారు. అధికార పార్టీ నేతలు, నాయకులతో ఉన్న పరిచయాలను ఉపయోగిస్తున్నారు. జిల్లాలోని నియోజకవర్గ స్థాయి అధికారులు తమకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసుకుంటున్నారు. కీలకశాఖలైన రెవెన్యూలో ఆర్‌డిఒ, తహసిల్దార్, డిప్యూటీ తహసిల్దార్, పోలీసు శాఖలో డిఎస్పీ, సిఐ, ఎస్ఐ, విద్యాశాఖ, వ్యవ సాయశాఖ, ఇరిగేషన్, తదితర శాఖల్లో మంచి స్థానాలను దక్కించుకొనేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కీలకమైన స్థానాల్లో పోటీ తీవ్రంగా మారింది. జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గ కేంద్రాల్లో పని చేసేందుకు అధికారులు ఉత్సాహం చూపుతున్నారు. అంతే స్థాయిలో తాజా ప్రజా ప్రతినిధులు త మకు అనుకూలమైన వారిని జాబితాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. మంత్రి, ఎమ్మెల్యే వర్గాల్లోని ద్వితీయశ్రేణి నేతలు ఈ ప్రక్రియను పరిశీలిస్తున్నారు. గత ప్రభుత్వంలో అధికార పార్టీకి వంత పాడిన అధికారులను సాగనంపేందుకు మొదటిప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు మధ్యస్థంగా ఉండాలి, కానీ గత ప్రభుత్వ హయంలో చాలామంది అధికారులు అధికార వైసీపీ జెండా మోయకున్నా, పార్టీ కండువా కప్పుకోకున్నా ఆ పార్టీకి అనుకూలంగా పని చేశారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ప్రధానంగా పోలీసుశాఖ, రెవెన్యూ శాఖలో ఆ తరహా అధికారులను కలిసేందుకు ప్రజాప్రతని ధులు ఇష్టపడటం లేదు. నంద్యాల జిల్లా కేంద్రం విద్యాశా ఖలో ఓ ఉన్నతాధికారి సాక్షాత్తు మంత్రిని కలిసేందుకు ఇష్టపడని విషయం సోషల్ మీడియాలో తీవ్ర ప్రచారం సాగింది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఆయన మం త్రిని కలిసేందుకు కష్టపడాల్సి వచ్చింది. మంత్రి సానుకూ లంగా స్పందించి తన రాజకీయ అనుభవాన్ని ప్రదర్శించా రు. వ్యవసాయ శాఖలో పలువురు అధికారులపై అంతే స్థాయిలో ఆరోపణలు ఉన్నాయి. ఇకపోతే జిల్లాలో అదాయ వనరులైన స్థానాల కోసం పోటీ తీవ్రంగా ఉంది. మరి ప్రజాప్రతినిధులు ఎవరికి పచ్చజెండా ఊపుతారో వేచి చూడాలి ..

# సకాలంలో రోడ్ల నిర్మాణాలు చేపట్టండి : మంత్రి బీసీ

**బనగానపల్లె, మేజర్‌న్యూస్ :** సకాలంలో రోడ్లు నిర్మాణాలు చేపట్టి ప్రయాణికులకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని రోడ్డు భవనాల శాఖా మాత్యులు, బీసీ జనార్థన్ రెడ్డి అన్నారు. యాగంటిపల్లె గ్రామం వద్ద కల్వర్ట్ నిర్మాణాన్ని మొదలుపెట్టి మధ్యలో ఆపివేయడంతో యాగంటి పుణ్యక్షేత్రానికి వెలుతున్న భక్తులు ప్రతిరోజు ఇబ్బంది పడుతున్నారు అంతేకాక వర్షాలు పడిన రోజున గంతలు ఎక్కడ ఉన్నాయో కూడా కనిపించడం లేదు ఈ పరిస్థితిని యాగంటిపల్లె గ్రామస్థులు బీసీ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన అక్కడ పరిస్థితిని పరిశీలించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రోడ్ల మరమ్మత్తులను వెంటనే చేపట్టాలని ఎక్కడా ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని


కల్వర్టును పరిశీలిస్తున్న దృశ్యం

అలాగే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

# పాఠశాల విద్యను నిర్వీర్యం చేసే ఉత్తర్వు 117ను రద్దు చేయాలి : ఎపీటీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న మాధవస్వామి

**బనగానపల్లె, మేజర్‌న్యూస్ :** పాఠశాల విద్యను నిర్వీర్యం చేసే ఉత్తర్వులను రద్దు చేయాలని ఎపీటీఎఫ్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ నూతన విద్యాశాఖా మంత్రిగా నారా లోకేష్ విద్యా వ్యవస్థలో మార్పుకు శ్రీకారం చుట్టాలని ఎపీటీఎఫ్ కోరింది. బనగానపల్లె డివిజన్ కార్యాలయంలో వెంకటక్రిష్ణుడు అద్యక్షతన సమావేశం నిర్వహించారు. పాఠశాల విద్యను అందులోను ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసే ఉత్తర్వు 117ను రద్దు చేసి పాఠశాల విద్యకు పునర్జీవం తీసుకొని రావాలని ఎపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం. మధుసూదన్‌రావు జిల్లా అద్యక్షులు బి. మాధవ స్వామి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను పత్రికా ముఖంగా కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు వీరన్న, రాష్ట్ర కౌంటిలర్ సుబ్బరాయుడు, గోవిందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయిలో విలువిద్య పోటీల్లో ప్రియదర్శిని విద్యార్థుల ప్రతిభ

**బనగానపల్లెరూరల్,న్యూస్:** కర్నూలు జిల్లా స్థాయిలో అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన అండర్ - 10, అండర్ - 13, అండర్ - 14, బాలబాలికల విభాగాల్లో పోటీలు నిర్వహించబడాయి. ఇందులో సుమారుగా 150మంది విద్యార్థులు పాల్గొన్నారు. బనగానపల్లె ప్రియదర్శినీ ఇంగ్లీషు మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్ - 10 ఏజ, హింగ్


మెడల్స్ సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విభాగంలో తృతియ స్థానంలో సందీప్ నిలిచాడు. అండర్ - 13 విభాగంలో ప్రథమ స్థానంలో ఎం. కాకికియా ద్వితియ స్థానం అజ్మూల్ మరియు తృతియ స్థానంలో రోహిత్ నిలిచారు. ఈ కార్యక్రమంలో ప్రియదర్శినీ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ కరెస్పాండెంట్ కెసర్లింగ్ , ప్రధానోపాధ్యాయురాలు సబిరాబి మరియు దుర్గా ప్రసాద్‌లు విద్యార్థులను అభినందించారు.


రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ మారుతీ సకారం

## పశు వైద్యశాలలను అకస్మికంగా తనిఖీ చేసిన

# డాక్టర్ మారుతీ సకారం

**అవుకు, మేజర్‌న్యూస్ :** అవుకు, చెన్నంపల్లి, చనుగొండ్ల ఆర్.బి.కె సెంటర్లను బనగానపల్లె అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మారుతీ సకారం అకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. విధి నిర్వహణలో భాగంగా పశువైద్య సిబ్బం దిని సమయపాలన పాటించాలని సత్‌ప్రవర్తనతో విధు లను సక్రమంగా నిర్వర్తించాలని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మారుతీ సకారం సిబ్బందికి సూచించడం జరిగింది.

# కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో మెగా డిఎస్సీ కోసం నిరుద్యోగులు గత ఐదేళ్ళ నుంచి వేచి చూస్తున్నారని, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రాకతో మెగా డిఎస్సీ పేరుతో 16347తో నోటిఫికేషన్ రావడం జరిగిందని నిరుద్యోగులు




డిఎస్సీ కోసం సిద్ధమవుండగా కోచింగ్ సెంటర్లు మంచి కోచింగ్ ఇస్తామని నిరుద్యోగులను మభ్యపెడుతున్నారని డివైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు వంశీ, శివలు తెలిపారు. డిఎస్సీ పేరు చెప్పుకుంటూ కొత్త కోచింగ్ సెంటర్లు ఓపెన్ చేస్తున్నారని వీటికి అనుమతి ఎలా ఇస్తున్నారన్నారు. దీనిద్వారా నిరుద్యోగులు చాలా నష్టపోతున్నారని ఒకవైపు నోటిఫికేషన్ లేక మరోవైపు ఉపయోగాలు లేక నోటిఫికేషన్ వచ్చిన సరైన ఫ్యాకల్టీ లేక నిరుద్యోగులు చాలా నిరాశ పడుతున్నారన్నారు. నిరుద్యోగులను మోసం చేస్తున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# బాలుడిని తల్లి చెంతకు చేర్చిన స్ఫూర్తి సేవా సమితీ


బాలుడిని తల్లికి అప్పగించిన పోలీసులు, సభ్యులు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన 4 సంవత్సరాల వయస్సు గల బాలుడు మంగళవారం తన తల్లితో పని నిమిత్తం డోన్ పట్టణానికి వచ్చాడు. డోన్‌కి వచ్చిన సమయంలో అనుకోకుండా బాలుడు తప్పిపోయి, పట్టణ సమీపంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై తిరుగుతుండగా, దీనిని గమనించిన స్థానికులు బాలుడిని డోన్ రూరల్ పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. ఈ సమాచారాన్ని స్ఫూర్తి సేవా సమితీ సభ్యులకు పోలీసులు అందివ్వగా, సభ్యులు బాలుడి ఫోటోను సోషల్ మీడియాలో ప్రచారం చేయడంతో, ఈ సమాచారాన్ని చూసిన బాలుడి సమీప బంధువులు ద్వారా సమాచారం అందుకొని బాలుడి తల్లి లక్ష్మి పోలీసుస్టేషన్‌కి రావడంతో పోలీసు వారు ఆమెను విచారించి, అనంతరం బాబుని తల్లికి అప్పగించారు. అనంతరం బాలుడి తల్లి పోలీసులకు, స్ఫూర్తి సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసింది. అదేవిధంగా బాలుడిని తల్లి చెంతకు చేర్చడంలో సహకరించిన స్ఫూర్తి సేవా సమితీ సభ్యులను పలువురితోపాటు రూరల్ ఎస్సై సుధాకర్‌రెడ్డిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి సేవా సమితీ వ్యవస్థాపక అధ్యక్షుడు సీసంగుంతల మధు, రూరల్ పోలీసు సిబ్బంది, స్ఫూర్తి సభ్యులు పాల్గొన్నారు.




# కురుకుంద గ్రామంలో యువకుడు హత్య

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని కురుకుంద గ్రామంలో యువకుడు దారుణంగా హత్యకాబడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు కురుకుంద గ్రామానికి చెందిన ఫారూక్, కృష్ణాపురం గ్రామానికి చెందిన ముర్తుజావలిలు కవ్వబన్ను వ్యాపారం చేసుకొని హైదరబాద్


మృతి చెందిన ఖాదర్ వలి

నుంచి ఆత్మకూరుకు వచ్చే క్రమంలో ఇద్దరు చిన్న గొడవపడ్డారు. డ్రైవర్‌పక్కనే నేను కూర్చోవాలంటే నేను కూర్చోవాలని వాధించుకున్నారు. ఈ విషయంలో సోమవారం రాత్రి ఫారూక్ ముర్తుజావలికి ఫోన్ చేసి దమ్ముంటే కురుకుందకు రావాలని చూసుకుందామంటూ సవాల్ విసిరారు. గోపంతో ముర్తుజావలి ఈ విషయాన్ని తన మిత్రులకు తెలియజేయడంతో తన మిత్రుడు ఖాదర్‌వలిని తీసుకొని రాత్రి 10.30 గంటల సమయంలో కురుకుందకు వెళ్ళారు. ఎందుకు తిట్టావు అనే అడుగే క్రమంలో ఫారూక్ ఖాదర్‌వలిని కత్తితోఎడమ రొమ్ముపై పొడవగా తీవ్ర రక్తగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఖాదర్‌వలి తండ్రి మాలిక్ ఫిర్యాదు మేరకు సిఐ లక్ష్మినారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కడుపు నొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య



**పాములపాడు మేజర్ న్యూస్ :** మండలంలోని భానుముక్కల గ్రామానికి చెందిన దండగల విశ్వేశ్వరరావు(25) గత కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడని, కుటుంబీకులు తెలిపారు. కడుపు నొప్పి భరించలేక గత సోమవారం సాయంత్రం తన ఇంటిలోని బాత్రూంలో ఇనుప రేఖకు పైన ఉన్న రబ్బరు తాడుతో ఉరి వేసుకున్నట్లు పేర్కొన్నారు. స్థానికులు, కుటుంబ సభ్యులు కలిసి ఆత్మకూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.తండ్రి చిన్న హనుమన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

# నాకు ఆత్మహత్యే శరణ్యం

## - పిల్లల్ని చదివించుకోలేను - గుడిసెను వదులుకోలేను

## - బ్లాక్ మెయిలర్ల వేదింపులు తట్టుకోలేక నేత కార్మికుడి ఆత్మహత్య

**కోడుమూరు, మేజర్న్యూస్:** కోడుమూరు పట్టణంలో నివసిస్తున్న నేత కార్మికుడు గణేష్ పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంటూ తీసిన వీడియో సోషల్ మీడియాలో బుధవారం వైరల్ గా మారింది. వివరాల్లోకెళ్తే ఇలా ఉన్నాయి పట్టణం లోని కొండ పేటకు చెందిన గణేష్ పూరిపాకలో నేత వృత్తితో జీవనం చేస్తున్నాడు. భార్య తో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే పూరిపాక ఉన్న స్థలం వివాదంలో పడింది. ఈ వివాదం తొలగిపోవడానికి గణేష్ ను 8 లక్షలు ఇవ్వాలని బుక్ మెయిల్ చేస్తున్నారని, వారి వేధింపులకు తట్టుకోలేకనే తంసప్ లో పురుగుల వేసుకొని తాగి చనిపోతున్నానని, నా మరణం



అనంతరం పిల్లల చదువులు, భార్య, పూరిపాక స్థలం వివాదాన్ని పరిష్కరించి న్యాయం చేయవలసిందిగా పోలీసులను కోరాడు. కచ్చితంగా మగ్గంలో కష్టపడినప్పటికీ ఏమాత్రం మిగలడం లేదని ఈ అప్పులు ఎలా కట్టాలి వడ్డీలు కట్టుకోలేనని అందు ఆత్మహత్య చేసుకుంటున్నానని భార్యకు కూడా గణేష్ వీడియోలో తెలిపి నాకు మద్యపానం అలవాటులేదు కూల్డ్రింక్ లో పురుగుల మందు కలుపుకొని తాగి చనిపోతున్నానని రోదిస్తూ వీడియో తీసుకున్నాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో హల్చల్ గా మారింది. ఈ వీడియోతో నేతకార్మికులు కన్నీటి పర్యంతమయ్యారు.

# గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** జిల్లాలో అత్యంత వెనుకబడిన తుగ్గలి మండలంలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ కేటాయించే విదంగా చూడాలని మండలానికి చెందిన ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాగిరి చంద్రప్ప మాట్లాడుతూ తుగ్గలి మండలంలోని 16గ్రామాల్లో 100శాతం గిరిజనులు, సుగాలిలు జీవిస్తున్నారన్నారు. ఈ ప్రాంతాల అభివృద్ధికి ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతోపాటు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. తుగ్గలి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఏ జిల్లా కార్యదర్శి మధుక్రిష్ణ, టీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, కాటం యేసు పాల్గొన్నారు.

సూర్య






నేటి నుండి

# బాబా ఫరీద్ స్వాముల ఊరుసు ఉత్సవాలు

### 15వ ఊరుసు మహెూత్సవంకు ఘనంగా ఏర్పాట్లు



**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ :** ఎమ్మిగనూరు పట్టణ శివారులోని తెలిసిన శ్రీ సయ్యద్ బాబా ఫరీద్ స్వాముల వారి ఉరుసు ఉత్సవాలు నేటి నుండి ప్రారంభమవుతున్నట్లు పీఠాధిపతులు నూరు బాబా వెల్లడించారు బుధవారం పకీర్ల చే చౌక్లు అధిష్టిస్తారు. గురు వారం గుడికల్లు దర్గా నుండి ఎమ్మిగనూరు పట్టణ వీధుల గుండా స్వాములవారి గంధం మహెూత్సవాన్ని నిర్వహి స్తారు. శుక్రవారం స్వామి వారి ఉరుసు మహెూత్స వాన్ని నిర్వహిస్తారు. ఏ ఉత్సవాలకు మహారాష్ట్ర తమిళనాడు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుండి భక్తులు అశేషంగా తరలి వస్తారు.. భక్త కాలక్షేపానికి ఖవాలి నిర్వహించడం జరుగుతుంది.



నాలుగు రోజులపాటు దర్గా పీఠాధిపతులచే అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది..

ఇంటర్ ద్వితీయ సంవత్సర

# సప్లమెంటరీ ఫలితాలు విడుదల

### 52 శాతంతో 20వ స్థానంలో కర్నూలు

### ఒకేషనల్‌లో 45 శాతంతో 20వ స్థానం

**కర్నూల్ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** ఇంటర్ ద్వితీయ సంవత్సర సప్లమెంటరీ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదల అయ్యాయి. ఇంటర్మీడియట్ బోర్డు మే 25 నుండి జూన్ 1 వరకు ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను నిర్వహించింది. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 59 శాతంతో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సప్లమెంటరీ ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానం సాధించగా పశ్చిమ గోదావరి జిల్లా 26వ స్థానంలో నిలిచింది. కర్నూలు జిల్లా 52 శాతంతో 20 స్థానంలో నిలిచింది. జిల్లాలో మొత్తం 6008 మంది విద్యార్థులు పరీక్షలు రాయిగా 3114 మంది విద్యార్థిని విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ గ్రూపులో 45శాతంతో 25వ స్థానంలో నిలిచింది. 712 మంది పరీక్షలు రాయగా 319 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలను ఆన్లైన్లో http://rusultbie.org.gov.in ద్వారా పొందవచ్చు. ఒరిజినల్ మార్క్ మెమోను ఈనెల 30 నుంచి ఆయా కాలేజీల్లో విద్యార్థులు పొందవచ్చు. ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు ఈ రీ వెరిఫికేషన్ చేసుకునేందుకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవకాశం కల్పించింది. సబ్జెక్టుకు రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది.

## పెళ్ళికి ఆర్థిక సాయం



ఆర్థికసహాయం చేస్తున్న తెలుగుదేశం నాయకులు రామకృష్ణారెడ్డి

**కోసిగి మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కొలమాన్‌పేట గ్రామానికి చెందిన జోజి అనే టిడిపి కార్యకర్త కూతురు వివాహానికి ఆర్థికసహాయం అందజేయడం జరిగింది. కోల్‌మాన్‌పేట గ్రామానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త కూతురి వివాహం ఉన్నట్లు తెలుగుదేశం నాయకులు రాఘవేంద్రరెడ్డి, రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్ళినట్లు టిడిపి యువనాయకులు ఉప్పలపాటి అర్జున్ తెలపడం జరిగిందన్నా రు. దీనితో వారు స్పందించి 10,116/- రూపాయల ఆర్థికసహాయంను రామకృష్ణారెడ్డి చేతులు మీదుగా అందజేయడం జరిగింది. అలాగే తమ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాటి అర్జున్ పాల్గొన్నారు.

## మంత్రి ఫరూక్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే భూమా



ఫరూక్‌తో మాట్లాడుతున్న భూమా

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిగా ఫరూక్ ప్రమాణ స్వీకారం చేసిన తరువాత భూమా ఆయనను కలిశారు. ఇద్దరు పార్టీ అభివృద్ధితో పలు అంశాలపై చర్చించారు. ఆయన వెంట విశ్వనాథ్‌రెడ్డి, జయసింహారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చందు, తదితరులు ఉన్నారు.

## దస్తగిరి స్వామి దర్గాకు రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని ఎద్దులదొడ్డి గ్రామంలోని దస్తగిరిస్వామి దర్గాకు స్థానిక టీడీపీ నాయకులు పెదసాని రామానాయుడు మంగళవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పెదసాని రామానాయుడు మాట్లాడుతూ దస్తగిరిస్వామి దర్గా ఎద్దులదొడ్డి గ్రామానికి ఎంతో పవిత్రమైందన్నారు. దర్గా వద్ద నబిసాహెబ్ స్థలం ఉంటంతో ఆ స్థలాన్ని నబిసాహెబ్ దర్గాకు అప్పగించడంతో ఆయనకు రూ.లక్ష తన సొంత డబ్బులు ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామస్తుల సహకారంతో దర్గాకు కాంపౌండ్ నిర్మాణ పనులు కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు.

# సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే కోట్ల



వార్డులోకి ఎమ్మెల్యే కోట్లకు స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

**డోన్, మేజర్‌న్యూస్:** పట్టణంలోని తారకరామనగర్‌లోని వార్డులలో స్థానిక టిడిపి నాయకులతో కలిసి సమస్యలను ప్రజలను ఎమ్మెల్యే కోట్ల అడిగి తెలుసుకున్నారు. మంగళవారం ఉదయం వార్డులలో ప్రజలతో మమేకమై, స్వయంగా ఎమ్మెల్యే కోట్ల వారి సమస్యలను అడిగి తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ఐదు హామీలపై సంతకాలు చేసిన విషయం తెలిసిందేనన్నారు. వాటిలో నిరుద్యోగులకు మెగా డిఎస్సితో చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించి, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి కృషి చేశారన్నారు. అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించి పేదలకు అన్న క్యాంటీన్‌ల ద్వారా నాణ్యమైన భోజనాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా పాటిస్తామన్నారు. ముఖ్యంగా పట్టణంలో ప్రతి వీధిలో డ్రైనేజి సమస్య అధికంగా ఉందని, వాటిని పరిష్కరించేందుకు అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శులు కోట్రికె వెంకటఫణిరాజ్, వలసల రామకృష్ణ, ఓబులాపురం శేషిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, నంద్యాల జిల్లా టిడిపి అధికార ప్రతినిధి విజయభట్టు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ టిఈ.కేశన్నగౌడ్, నాయకులు కన్నపకుంట గోవిందు, న్యాయవాది ఆంజనేయగౌడ్, పుల్లయ్యగౌడ్, కె.పాలరాజు, రంగయ్యగౌడ్, ఎద్దుపెంట వెంకటేశ్వర్లు, చాకలి వెంకటేశ్వర్లు, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణపై కార్యాచరణ చేపట్టాలి

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరించాలని సత్యపాల్ కమిటీ, కారెం శివాజీ కమిటీలు ఇచ్చిన నివేదిక ఆధారంగా 2017లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారని వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌గోపాల్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు జయరామ్, మధుగోపాల్‌లు అన్నారు. మంగళవారం వాల్మీకి కార్యాలయంలో ఎస్టీ పునరుద్ధరణ అంశంపై జరిగిన సమావేశంలో నేతలు మాట్లాడుతూ అధికార పక్షంలో గెలిచిన ఎమ్మెల్యే, ఎంపీలు గత తీర్మానంపై ముఖ్యమంత్రితో చర్చించి వెంటనే కార్యాచరణ చేపట్టాలని ఈ అవకాశం వదిలితే వాల్మీకి జాతి నష్టపోతుందని 69ఏళ్ళ వాల్మీకుల పోరాటాలకు ముగింపు పడాలంటే ఇదే సరైన సమయమని కాలం గడిస్తే వాల్మీకుల్లో ఆవేశం, ఆందోళన మొదలవుతుందన్నారు. ఇప్పుడు కేంద్రం రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతో ముడిపడి ఉందని గతంలో 14ఏళ్ళ అధికారంలో ఉన్నా ఇంతటి అవకాశం కేంద్రంతో ఎప్పుడు రాలేదని నిజంగా బోయలమీద ప్రేమ, విశ్వాసం ప్రభుత్వం మీద గెలిచిన కులబిడ్డల మీద పోయే అవకాశం ఉందని సూచించారు. ఈసమావేశంలో వాల్మీకుల న్యాయ సలహాదారులు సుబ్బరాయుడు, మల్లికార్జున, నాయకులు నాగేశ్వరరావు, శివనాగేంద్ర, రమణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డులో కోల్డ్ స్టోరేజ్ గోదాము ఏర్పాటుకు కృషి చేస్తాం

### యార్డు ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటాం

### గత ఐదేళ్లలో మార్కెట్ యార్డును నిర్వీర్యం చేశారు

### అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బీవీ



**ఎమ్మిగనూరుటౌన్, మేజర్‌న్యూస్ :** ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు ఉపయోగపడే కోల్డ్ స్టోరేజ్ గోదాము ఏర్పాటుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక మార్కెట్ యర్డు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థితిగతులు, బడ్జెట్ గురించి ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అత్యంత ఉపయోగపడే మార్కెట్ యార్డ్ ను గత ఐదేళ్లుగా నిర్వీర్యం చేస్తూ వచ్చారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు, ఇతర సౌకర్యాలు కల్పించడం జరిగిందని గుర్తు చేశారు. మార్కెట్ యార్డ్ టర్నోవర్ పెంచే చర్యలు తీసుకోకుండా తుంగలో తొక్కారన్నారు. అభివృద్ధికి ఒక్క రూపాయలు కూడా పెట్టలేదన్నారు. త్వరలోనే యర్డు ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తామన్నారు. కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు అయితే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాన్ని తిరిగి ప్రారంభిస్తామన్నారు. కోవిడ్ సమయంలో తత్కాలికంగా ఏర్పాటుచేసిన వెజిటేబుల్ వెండర్స్ ద్వారా వ్యవసాయ కార్యక్రమాలకు ఉపయోగపడే స్థలాలు రైతులకు ఇబ్బందికరంగా ఉందన్నారు. దీనిపై చర్యలు తీసుకొని వారికి ఎక్కడ కేటాయించాలో ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. నా తండ్రి బీవీ మోహన్ రెడ్డి ఐదు ఎకరాలను కూరగాయల మార్కెట్ కొరకు ఏర్పాటు చేశారని, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మార్కెట్ ఆధునికరణ కొరకు ఐదు కోట్లు నిధులు కేటాయించడం జరిగిందని గుర్తు చేశారు. నిధులన్నిటిని గత పాలకులు సద్వినియోగం చేసుకోకుండా నాశనం చేశారన్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని ప్రాంతాలకు ఈ వ్యవసాయ మార్కెట్ యర్డు ఎంతో ఉపయోకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యర్డు కార్యదర్శి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

# బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం

## – కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి:** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావుయాదవ్‌తో కలిసి విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసయాదవ్‌ను నియమించడం హర్షణీయమన్నారు. తెలుగుదేశం పార్టీ బీసీల పక్షపాతి అనే దాన్ని మరోసారి ఈ నియామకంతో నిరూపించుకుందన్నారు. టీడీపీ మంత్రివర్గంలో కూడా ఎంతోమంది బీసలను, బడుగు బలహీన వర్గాల వారికి స్థానం కల్పించారన్నారు. టీడీపీ ప్రకటించిన ప్రతి హామీని నెరవేర్చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్‌షెక్షావలి, బెతక్రిష్ణ, ముంతాజ్, సత్రం రామక్రిష్ణుడు, రవికుమార్, సుకుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తిక్కారెడ్డి

# అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి ప్రత్యేక పూజలు

**కల్లూరు, మేజర్‌న్యూస్:** కల్లూరు అర్బన్ పరిధిలోని 19వవార్డు ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయిస్ కాలనీలోని శ్రీ శ్రీ సుంకులా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మహోత్సవం సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పూజలు నిర్వహించి అందరూ సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి దంపతులు, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్ పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

# కూటమితోనే అభివృద్ధి సాధ్యం

## – త్వరలోనే మంత్రాలయం జనసేన ఇన్‌ఛార్జీ నియామకం


సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

**కోసిగి, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే కూటమితోనే సాధ్యమవుతుందని జనసేన పార్టీ నాయకులు అనుమేష్, రామాంజినేయులు, ఏసేబు అన్నారు. మంగళవారం యస్‌సి కమ్యూనిటిహాల్‌లో జనసేన కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. త్వరలో మంత్రాలయం నియోజకవర్గంలో జనసేనపార్టీ ఇన్‌ఛార్జిని నియమిస్తున్నట్లు వారు తెలిపారు. అలాగే మండల, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటుచేస్తున్నామన్నారు. కూటమి విజయానికి జనసేనపార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ వెన్నుముకగా నిలిచారన్నారు. అలాగే దేశప్రధాని పవన్‌కళ్యాణ్ తుఫాన్‌లాంటి వాడని కొనియాడారు. పార్టీకోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా జనసేనపార్టీ నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మారెప్ప, ఈరన్న, ఉమేష్, రమేష్, రాంబాబు, వీరేష్, ఉదయ్, మహ్మద్ పాల్గొన్నారు.

# శ్రీమద్దులేటి లక్ష్మీ నృసింహస్వామికి స్వాతి జన్మ నక్షత్ర పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీమద్దులేటి లక్ష్మీ నృసింహస్వామి అమ్మవార్లు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దులేటి లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో స్వామివార్ల జన్మనక్షత్రమైన స్వాతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజనం, అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి నైవేద్యం నివేదన మహామంగళహారతి ఇచ్చారు. భక్తులు స్వామి వారికి అభిషేకం తిలకించి మహామంగళహారతి స్వీకరించి స్వామివారి ప్రసాదం అందజేశారు.

# నేడు కేంద్ర కరువు బృందం ఆలూరులో పర్యటన

**ఆలూరు, మేజర్‌న్యూస్..** 2023 2024 సంవత్సరానికి సంభందించి రబీలో నెలకొన్న కరువు పరిస్థితులను అంచనా వేయడానికి కేంద్ర కరువు బృందం నేడు ఆలూరు మండలంలో పర్యటించ నున్నట్లు తహశీల్దార్ చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి వెంకటేష్ గౌడ్‌లు తెలిపారు. మంగళవారం వారు పత్రికా ప్రకటన విడుదల చేస్తూ నేడు సాయంత్రం ఆలూరు రైతు భరోసా కేంద్రంలో రైతులతో ముఖాముఖి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.గత ఏడాది రబీ లో వర్షాలు కురియకపోవడంతో లక్షలాది ఎకరాలు విత్తిన రైతులు కోట్లాది డబ్బులు పోగొట్టుకున్నారని కానీ ప్రభుత్వం వారికి ఆర్థిక సహాయం అందించలేదన్నారు.కేంద్ర కరువు పరిశీలించడానికి వచ్చిన సమయంలో ఎన్నికలకోడ్ కూయడంతో కరువు బృందం తిరిగి వెళ్ళిపోయింది.కావున రైతులు తమకు జరిగిన నష్టాన్ని కరువుబృందం వద్ద విన్నవించుకోవాలన్నారు.

# హైకోర్టు న్యాయవాదికి సన్మానం

**కర్నూలు లీగల్, మేజర్‌న్యూస్:** నగరంలోని కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం హైకోర్టు న్యాయవాది బాలాజీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు క్రిష్ణమూర్తి, రవికాంత్‌ప్రసాద్‌లు మాట్లాడుతూ భూ హక్కు చట్టంపై రాష్ట్ర హైకోర్టులో పిల్ వేసి ఆ చట్టం అమలు కాకుండా బాలాజీ వాదించారని కొనియాడారు. అనంతరం న్యాయవాది బాలాజీ మాట్లాడుతూ న్యాయవాదులు ప్రజా సమస్యలపై ఎలాంటి వ్యాజ్యాలు అయినా వేసి వారి తరపున పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జయరాజ్, ఓంకార్, సివి.శ్రీనివాసులు, శ్రీవత్స, నిత్యజీవన్‌రాజు, చల్లా సుధాకర్‌రెడ్డి, తిరుపతయ్య, యాదవ్, వై.శ్రీను, మహేష్ పాల్గొన్నారు.


న్యాయవాది బాలాజీని సన్మానిస్తున్న దృశ్యం

# మాజీ సీఎం జగన్‌ను కలిసిన ఆదిమూలపు సతీష్

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌ను కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ మంగళవార క్యాంపు కార్యాలంలో కలిశారు. ఎన్నికల ఫలితాల తర్వాత భవిష్యత్తు కార్యాచరణ, నియోజకవర్గ పరిస్థితులపై జగన్‌తో మాట్లాడారు. రానున్న రోజుల్లో కోడుమూరు నియోజకవర్గంలో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి కోజపం ప్రతిరోజూ పనిచేస్తామని వారు తెలిపారు.


జగన్‌తో హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్

# అంగన్వాడి పాఠశాలలో బడిబాట కార్యక్రమం



**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన బేతంచర్ల పట్టణంలోని సంజీవ నగర్ కాలనీలో ఉన్న 13,14 అంగన్వాడి సెంటర్లలో బడిబాట కార్యక్రమం నిర్వహించినట్లు ఆయా పాఠశాలల టీచర్లు కే.రాధమ్మ బి.మల్లేశ్వరమ్మ లు తెలిపారు. మంగళవారం పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా 3 నుండి ఐదు సంవత్సరాల పిల్లలను సంబంధిత అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని, పాఠశాలలో చేరిన చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో పాటు, పౌష్టికాహారం, ఆట వస్తువులు,ఆటట్టుకునే ఛాయా చిత్రాలతో ఉన్న ప్రీ ప్రైమరీ పుస్తకాలను అందించి, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా, తమ సెంటర్లోని నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ బడిబాట కార్యక్రమంలో ఆయా పి.శివమ్మ,విద్యార్థుల తల్లిదండ్రులు ,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవన్‌లో టీఎంఆర్ లక్కీడ్రా


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:** నగరంలోని అబేద్కర్‌భవన్‌లో మంగళవారం టీఎంఆర్ 99వరల్డ్‌షాప్ యజమానులు లక్కీడ్రా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి, ఆయన సతీమణి ఎస్వీ విజయమనోహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఎంఆర్ 99వరల్డ్‌షాప్ లక్కీడ్రా నిర్వహించడం అభినందనీయమన్నారు. చదువుకున్న యువత ఉద్యోగాల కోసం కాకుండా టీఎంఆర్ వరల్డ్ షాప్ యజమానులు తబిత, రవిలను ఆదర్శంగా తీసుకొని వ్యాపార రంగంలో రాణించాలని కోరారు. అనంతరం లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

# ప్రవర్తన నియమావళిపై అవగాహన పెంచుకోండి : జెసి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన నియమావళి, సీసీఏ, కండక్ట్ రూల్స్‌పై ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి కలెక్టరేట్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సీసీఏ రూల్స్, కండక్ట్ రూల్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ, అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి తన విధులలో విరుద్ధంగా ప్రవర్తించి అతిక్రమించిన ఎడల ఎలాంటి చర్యలు తీసుకోవాలి, విచారణ ఎలా చేపట్టాలి అనుసరించాల్సిన విధి విధానాలపై తెలుసుకుని ఫైళ్ళను పంపించాలని అధికారులకు ఇబ్బందులు ఉండవని ఆయన సూచించారు. రూల్స్ అతిక్రమించిన సిబ్బందికి విధించిన క్రమశిక్షణ చర్యలు దస్త్రాలను పరిశీలించుకోవాలన్నారు. ప్రతి ఉద్యోగి హాజరు వేళలు, హాజరు రిజిష్టర్, కార్యాలయానికి ఆలస్యంగా హాజరవుట, పనివేళల్లో కార్యాలయాన్ని వదలి వెళ్లిపోవడం, యాదృచ్చిక సెలవు, నిర్వహించాల్సిన రిజిష్టర్లు తదితర ప్రాథమిక సూత్రాలు తెలిసి ఉండాలన్నారు. నిరుపేదలకు రాయితీపై అందించే అన్న క్యాంటీన్లకు:జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో నిరుపేదలకు రాయితీపై ఆహారాన్ని అందించే అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి మున్సిపల్ కమిషనర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. గతంలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిన భవనాల్లో సచివాలయాలు, ఇతర ప్రభుత్వ భవనాలు ఉంటే వాటిని అనువైన ప్రదేశానికి తరలించాలని చర్యలు తీసుకోవాలన్నారు. వాటిని అన్న క్యాంటీన్లకు వినియోగించుకొనేందుకు అవసరమైన ఫర్నిచర్, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌళిక సదుపాయాలు ఏర్పాటుకు ఆర్థిక అంచనాలు రూపొందించి వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి


కరెంట్ అఫైర్స్

సూర్య www.suryaa.com

# ప్రజ్ఞ

suryaapragna71@gmail.com

పేజీలు 12



General English

SI of Police Mental Ability

# లక్ష్యం-2024

కొత్త సంవత్సరం

సాధించాల్సిన లక్ష్యాలు


ఎకానమి



స్పోర్ట్స్ రౌండప్


జాగ్రఫీ

# నంద్యాల జిల్లా స్థాయి చదరంగం జట్ల ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో అతిథులు డాక్టర్ రవి కృష్ణ, సుధాకర్

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యం లో మంగళవారం సంజీవ నగర్‌లో ఉన్న సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్ ఆవరణలో 11 సంవత్సరాల లోపు బాల బాలికల నంద్యాల జిల్లా చదరంగం జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.రామ సుబ్బారెడ్డి నిర్వహణలో జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు, నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, శాంతినికేతన్ విద్యా సంస్థల గౌరవ సలహాదారు సుధాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు ట్రోఫీలు,పతకాలు అందజేశారు.

**జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు:** బాలుర విభాగంలో మోక్షిత్ కుమార్, హెూమేశ్వర్,బాలికల విభాగంలో శాన్వీ,శాలిని వరుసగా ప్రధమ,ద్వితీయ స్థానాలలో నిలిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైనటువంటి క్రీడాకారులు నంద్యాల జిల్లా తరఫున భీమ వరంలో జరిగే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో అర్బిటర్లు సుజాత,సునిత్ కుమార్,శాలెం మనికుమర్, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అర్ధాంతరంగా ఆగిపోయిన అంగన్వాడీ భవనం

**అమ్మా..!మా అంగన్వాడీ బడి ఎప్పుడు కడతారట ..!**

**ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని అంగన్వాడీ భవనం**



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** అమ్మా.. మేము ఇంకా ఎన్నేళ్లు అంగన్వాడీ అద్దేఇళ్ళలో చదువు కోవాలిచెప్పామ్మా..మన ఊరు లో ఆర్ధాంతంగా ఆగిపోయిన అంగన్వాడీ కేంద్రం ఎవ్వరూ పట్టించుకో వడం లేదా. ఎప్పుడు కడతారంటామ్మా... అంటూ మండలకేంద్ర మైన పెద్దకడుబూరు గ్రామంలో ఎస్సీ కాలనీలో ఉన్న 5వ అంగన్వా డీ కేంద్రానికి వెళ్లే పిల్లలు తమ తల్లిదండ్రులతో అంటున్నారు. దీంతో తమపిల్లలతో మాట్లాడుతూ గతంలోఉన్న పాఠశాల భవనంను కూల్చివేసి అంగన్వాడీ భవనం నిర్మించేందుకు అప్పట్లో రూ8లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారని నిధులతో కంట్రాక్టర్ బేస్ మట్టంవరకు గోడలు నిర్మించి వదలి వేయడం జరి గిందన్నారు. ఆనాటి నుండి నేటి వరకు అసంపూర్తిగానే మిగిలి పోయిందన్నారు .ఎన్నిసార్లు స్థానిక కాలనీ వాసులు ఎన్నిమార్లు ఎమ్మెల్యే. జిల్లా ఐసిడిఎస్ అధికారులకు. స్థానిక ప్రజాప్రతినిధులకు అర్జీలు ఇచ్చినా ఇంతవరకూ ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి తమ ఎస్సీ కాలనీలో అసంపూర్తిగా ఉన్న 5వ అంగన్వాడీ కేంద్రాభవనం నిర్మాణం చేపట్టాలని పిల్లలు. వారి తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.

# భూమా శోభ ఘాట్‌లో నివాళులర్పించిన అఖిలప్రియ, విఖ్యాత్‌రెడ్డి

**-అభిమానుల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ**


ఘాటు వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ , మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా విజయం సాధించిన తర్వాత విజయవాడ నుంచి మొదటిసారిగా ఆళ్లగడ్డకు వచ్చిన భూమా అఖిల ప్రియకు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. భూమా ఘాటుకి చేరుకున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, తాలూకా టిడిపి నాయకులు జగత్ విఖ్యాత రెడ్డిలు స్వర్గీయ భూమా దంపతులకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం భూమా శోభ ఘాట్ నుంచి కందుకూరు రోడ్డు పాత బస్టాండు, టీవీ రోడ్డు మీదుగా అఖిలప్రియ ఇంటి వరకు భారీ బైకు ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. టాపు లేని జీపుపై ప్రజలకు అఖిలప్రియ అభివాదం చేస్తూ కరచాలనం చేస్తూ, చేయి ఊపుతూ ముందుకు సాగారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అయిన తర్వాత భూమా భూమా అఖిల ప్రియ మొదటిసారి రావడంతో అభిమానుల్లో పండు గ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పర్యాటకులతో గాజులదిన్నెలో సందడే సందడి

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** బక్రీద్ పండగను పురష్కరించుకొని ముస్లింలు పెద్దఎత్తున గాజులదిన్నె ప్రాజెక్టుకు విచ్చేశారు. గతంలో పర్యాటక కేంద్రంగా ఉండటంతో ఈ పండుగ సం దర్భంగా ఎమ్మి గనూరు, కోడుమూరు, దేవనకొండ, గోనెగండ్ల తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పర్యటకు తమ స్వంతవాహనాల్లో మహిళలు, పిల్లలు, యువకులు పెద్ద ఎత్తు తరలివచ్చారు. పండుగ సందర్భం గా చేసి వంటకాలను తీసుకుచ్చి ప్రాజెక్టో బంధువు లు, స్నేహితుల తో కలస భోజనం చేసి ప్రాజెక్టు నీటిలో కొంతసేపు జలక్రీడలాడా రు. సాయంత్రం తమ స్వంత గ్రామాలకు బయలు దేరారు. దీంతో ఉదయం నుంచి ప్రాజెక్టు ప్రాంతం సందడిగా మారిపోయింది.


గాజులదిన్నె ప్రాజెక్టులో పర్యాటకులు

# గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలి

**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** గ్రామాల్లో ప్రశాంత వాతావరణము ఉండేలా చర్యలు తీసుకోవా లని జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ అన్నారు. ఓర్వ కల్లు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ను కర్నూలు జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ మంగళ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సం దర్భంగా ఎస్సై రాజారెడ్డి వారి సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాల్లో పోలీసుల పర్యటి స్తూ సమస్యల గురించి ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ గ్రామాలలో ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సమ స్యల పట్ల బాధితులు స్టేషన్లో ఆశ్రయించి నప్పుడు వారి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలనిఅన్నారు. ఎన్నికల విధుల్లో ఎక్కడ కూడా ఇలాంటి సంఘటనలు జరగకుండా బాగా పనిచేశారని పోలీస్ సిబ్బందిని అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఎస్సై కి సూచించారు.



తనిఖీ నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్

# జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయండి


పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఈనెల 29న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని ఆళ్లగడ్డ ఐదవ అదనపు జిల్లాజడ్జి, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు ఆర్ వివిఎస్ మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని కోర్టులో మంగళవార ం పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని పోలీసులకు సూచించారు. సివిల్ మరియు రాజీకీ అర్హత కలిగిన కేసులన్నీ లోక్ అదాలత్లో పరిష్కరించుకోవచ్చు అన్నారు. కక్షి దారు లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అపరిష్కృతంగా కోర్టులో పెండింగ్లో ఉన్న రాజకీయ అర్హత కలిగిన కేసులన్నీ లోకదాత్‌లో పరిష్కరించుకోవచ్చు అన్నారు. ఆళ్లగడ్డ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులుపి. సూర్యనారాయణ రెడ్డి, డి.ఎస్.పి షర్ఫుద్దీన్, సిఐలు ఎస్ఐలు పాల్గొన్నారు.

# మండలంలో భారీ వర్షం ..ఉప్పొంగిన కుందర వాగు

**-రెండు గంటల వ్యవధిలో 109.6 మి.మి. -ఆళ్లగడ్డకు నిలిచిపోయిన రాకపోకలు**

**ఉయ్యాలవాడ, మేజర్ న్యూస్ :** పగలంతా విపరీతంగా ఎండ కాసింది. చీకటి పడేసరికి నిర్మలమైన ఆకాశంలో చందమామ చూపరులకు కనువిందు చేశాడు. అయితే తెల్లవారు జామున రెండున్నర గంట నుండి రెండు గంటలసేపు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. చిన్న చిన్న కాలువలు, కుంటలుపొంగి పొర్లాయి. ఇంజేడు గ్రామ సమీపంలోని కుందర వాగు వంతెన పై నుండి వర్షపు నీరు ప్రవహించడంతో మండల కేంద్రం నుండి ఆళ్లగడ్డ వైపు మధ్యాహ్నం 12 గంటల వరకు రాకపోకలు నిలిచిపోయా యి. పాఠశాలలు కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అటు పొలా ల్లో గడ్డి విపరీతంగా పెరిగిపోతుండడంతో సేద్యలకు అనువుగా లేక, బీల్లుగా మారుతాయ ని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. అయితే ఈ మధ్య సాగుచేసిన మినుము, పెసర పంటలకు ఉపయోగకరంగా ఉంటుంది.

# హాస్టల్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** ఓర్వకల్లు మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలుర వసతి గృహానికి దరఖాస్తు చేసుకోవాలని హాస్టల్ వార్డెన్ సుంకన్న అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధార్ కార్డ్ రేషన్ కార్డ్ అప్లికేషన్ తీసుకొని దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు.

# డీఎస్సీలో సీఆర్ఎంటీలకు వెయిటేజ్ కల్పించాలి


ఎంఈవో వినతి పత్రం అందజేస్తున్న సీఆర్పీలు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీ(ఉపాధ్యాయ ఉద్యోగ నియామా కాలు)లో ఎంఈ వో కార్యాలయాలో సీఆర్ ఎంటీలు గా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం వెయిటేజ్ కల్పించాలని కర్నూలు జిల్లా సీఆర్ఎంటీ నాయకు లు పుల్లన్న, గోవిందరాజు, రవికుమార్ కోరారు. మంగళవారం స్థానిక ఎంఈవో కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా విద్యాశాఖ లో సీఆర్ఎంటీ, ఎంఐఎస్, డీటీపీ, పీటీఐ, ఐఈఆర్టీ లుగా కాంట్రాక్ట్ ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం 2024లో ఇంటర్, డీఎడ్, డిగ్రీ, బీ, ఎడ్. టీఈటీ, బీపీఈడీ, ఎంపీఈడి లో సమానంగా అర్హతలు ఉన్నా మాకు పరీక్షలలో వెయిటేజి కల్పించాలని కోరుతున్నామన్నా రు. గత ప్రభుత్వం మాకోరికలు నెరవేర్చలేదని పనికిసమాన వేతనం ఇవ్వలేదని వారు ఆవే దన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వమైనా మాకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

# ఖరీఫ్ పంటల సాగుపై అవగాహన ఉండాలి

**పాములపాడు, మేజర్ న్యూస్ :** పాములపాడు మండల వ్యవసాయ అధికారి పనిశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఖరీఫ్ పంట సాగు సంయుక్త కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి హేమలత ఖరీఫ్ పంటలకు సాగుకు రైతులు ఖరీఫ్లో సాగు చేసే మొక్కజొన్న సోయాసికుడు వరి మినుము పత్తి పంటల్లో సాంకేతిక పరిజ్ఞానంతో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు ఇందులో భాగంగా భూసార పరీక్షలు నిర్వహించి ఎరువులు వాడాలని కోరారు విత్తన శుద్ధి చేస్తే విధానం గురించి వివరించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది గాయత్రి ఇలియాస్ చాంద్ బాషా రైతులు పాల్గొన్నారు.



## ఆర్డిటి కాలనీ సమీపంలో

# చెత్తడంపును తీసివేయాలి

- రాత్రికి రాత్రే చెత్తతో బావిని పూడ్చివేత
- నిరసన తెలియజేసిన సిపిఐ పట్టణ కార్యదర్శి టి.ప్రతాప్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** పట్టణ శివారు ప్రాంతం ఆర్డిటి కాలనీలో నివసిస్తున్న పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు కనీస వసతులు కల్పిస్తు పారిశుద్ధ్యం లోపించకుండా చూసుకోవాల్సిన మున్సిపల్ అధికారులే కాలనీలో బావిని డంపు యార్డుగా ఎంచుకొని చెత్తతో నింపడం సరికాదని సిపిఐ తాలూకా కార్యదర్శి టి ప్రతాప్ అన్నారు. మంగళవారం సిపిఐ తాలుకా కార్యదర్శి ప్రతాప్ కాలనీ వాసులతో కలిసి చెత్తతో నింపిన బావిని పరిశీలించారు. వెంటనే బావిని చెత్తను తొలగించి కాలనీ వాసులు రోగాల భారిన పడకుండా కాపాడాలని కమీషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఆర్డిటి కాలనీ ప్రజల మధ్య పాతబడిన బావిని డంపుయార్డుగా ఎంచుకొని రాత్రికి రాత్రే బావిని చెత్తతో నింపడం సరికాదన్నారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు నివసించే ప్రాంతంలో చెత్తతో నింపితే దోమలు విస్తరించి వ్యాధుల భారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఉన్నట్లుండి కాలనీ సమీపంలో



ఆర్డిటి కాలనీ వద్ద చెత్తతో నిండిన బావి

ప్రజల మధ్య డంపుయార్డును ఏర్పాటు చేయడం ఏమిటని, పేదలు, కూలీనాలిచేసుకొని జీవనం సాగించే ప్రజలు ప్రశ్నించలేరని వారిని రోగాల భారిన పడేలా చేయాలనుకోవడం సరికాద న్నారు. ఇప్పటికే అరకొర వసతులతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే దానికి తోడు రోగాలు తెచ్చేందుకు డంపుయార్డును ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. విద్యుత్, తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. వర్షాకాలం ప్రారంభమైందని, వీధి దీపాలు ఏర్పాటు చేసి కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన డంపుయార్డును ఎత్తివేసి ప్రజలను రోగాల భారి నుంచి కాపాడాలని కోరారు. లేదంటే కాలనీ వాసులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటిసి కాలనీ వాసులు పాల్గొన్నారు.




చెత్తను తొలగించాలంటూ సిపిఐ నాయకులు నిరసన చేస్తున్న దృశ్యం

## కేంద్ర కరువు బృంద పర్యటనపై

# అప్రమత్తంగా ఉండాలి

- అన్ని వివరాలు సేకరించండి
- నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

**నంద్యాలకల్చరల్, మేజర్‌న్యూస్ :** గత సంవత్సరం రబీ సీజన్‌లో పంట నష్టపోయిన వివరాలను ఇంటర్ మినిస్ట్రియల్ కేంద్ర బృందంకు స్పష్టంగా నివేదించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన చాంబర్‌లో కేంద్ర కరువు బృంద పర్యటనపై జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర బృందం అధికారి, న్యూఢిల్లీ వ్యయ అంచనా పరిశీలకులు డైరెక్టర్ చిన్మయ గాట్మేర్ తాగునీరు, పారిశుధ్య శాఖ డిప్యూటీ సహాయ అధికారి ఆషీస్ పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి అరవింద కుమార్ సోని సభ్యుల బృందం ఈనెల 20వ తేదీన జిల్లాకు రానుందని, కేంద్ర కరువు బృందం పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి కరువు తీవ్రతను ఆ బృంద పరిశీలకులకు సమగ్రంగా వివరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను ఆదేశించారు. కరువుకు సంబంధించి 13 మండలాల్లో 36,389హెక్టార్లలో పప్పు శనగలు, 4,116 హెక్టార్లలో మినుములు, 2,076 హెక్టార్లలో పొగాకు, 12,908 హెక్టార్లలో జొన్న పంటలకు జరిగిన నష్టాన్ని స్పష్టంగా అర్థమయ్యే రీతిలో కేంద్ర కరువు బృందంకు వివరించాలన్నారు. తమ్మరాజుపల్లెలోని వాటర్ స్కీం, కోవెలకుంట్ల మండలంలోని



కేంద్ర కరువు బృంద పర్యటనపై అధికారులతో సమావేశమైన కలెక్టర్ శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డిలు

బీమునిపాడు గ్రామం, ఉయ్యాలవాడ మండలంలోని హరివరం గ్రామాలలో కేంద్ర కరువు బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించనున్న నేపథ్యంలో వివిధ పంటలను సాగుచేసి నష్టపోయిన రైతులతో ముఖాముఖి నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఇందుకు సంబంధించి నష్టపోయిన పంటల ఫోటోలను ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా ప్రదర్శించాలన్నారు. అలాగే పశుగ్రాస కొరత వల్ల తగ్గిన పాల ఉత్పత్తి, కరువు మండలాల్లో కూలీలకు కల్పించిన పనులు, ట్యాంకర్ల ద్వారా నీటి రవాణా, రబీలో సాగుకు సరఫరా చేసిన సాగునీటికి సంబంధించిన వివరాలను అధికారులు నివేదికలను సిద్ధం చేయాలన్నారు. ఈసమావేశంలో డీఆర్వో పద్మజ, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఉద్యానశాఖ అధికారి నాగరాజు, భూగర్భ జలశాఖ డిడి రఘురాం, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ మనోహర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## ప్రధానమంత్రి కిసాన్ సమాన్ కింద

# రూ.4కోట్ల 35లక్షల 48వేలు మంజూరు

- ఎమ్మెల్యే పార్థసారథి

**ఆదోనిరూరల్ , మేజర్ న్యూస్ :** ప్రధానమంత్రి కిసాన్ సమాన్ కింద రూ.4కోట్ల 35లక్షల 48వేలు మంజూరైనట్లు ఎమ్మెల్యే పార్థసారధి పేర్కొన్నారు. మంగళవారం ఆరేకల్లులో మ్యాచువల్ డిబిటిద్వారా రైతుల ఖాతాల్లో రూ.2వేలు జమ చేశార న్నారు. అనంతరం ఎమ్మెల్యే రైతులతో ముఖాముఖీ మాట్లాడుతూ, పెట్టుబడి సహాయాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదోని మండలంలో 21,774మంది రైతులకు రూ.4కోట్ల 35లక్షల 48వేలు డిబిటి ద్వారా రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఓ అశోక్ కుమార్ రెడ్డి, గ్రామ సర్పంచు లోహిత ప్రియ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## రెండు సూపర్ లగ్జరీ ఆర్టీసి బస్సులను

# ప్రారంభించిన ఎమ్మెల్యే కోట్ల

### ప్రయాణికులతో కలిసి ఎమ్మెల్యే కోట్ల ప్రయాణం

**డోన్, మేజర్‌న్యూస్ :** డోన్ పట్టణ ఆర్టీసి డిపోకు రెండు ఆర్టీసి సూపర్ లగ్జరీ బస్సులను డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి ప్రారంభించారు. మంగళవారం ఉదయం ఆర్టీసి డిపో గ్యారేజ్ నందు టిడిపి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసికి మెరుగైన సేవలు అందించి, ఆర్టీసి ఆదాయాన్ని రెట్టింపు దిశగా అడుగులు వేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రయాణించే ప్రయాణికులకు అనువైన దిశగా చర్యలు చేపట్టేందుకు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా మహిళలకు ఆర్టీసి బస్సులలో ఉచిత ప్రయాణాన్ని త్వరలోనే ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం నూతన బస్సులలో ప్రయాణికులతో పాటు ఎమ్మెల్యే కోట్ల పట్టణంలో కలిసి ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, నంద్యాల జిల్లా టిడిపి అధికార ప్రతినిధి విజయభట్టు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ టిఈ.కేశన్నగౌడ్, బీజేపి నాయకులు వడ్డె మహరాజ్, జనసేన నాయకులు బ్రహ్మం, న్యాయవాది ఆంజనేయగౌడ్, ఓబులాపురం శేషిరెడ్డి, కునిశెట్టి మల్లికార్జున, కె.పాలరాజు, పుల్లయ్యగౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



లగ్జరీ బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

# బిఎల్‌ఓల రెమ్యూనరేషన్‌లో కోత

- బడ్జెట్ అందలేదని సాకు
- సూర్య కథనానికి స్పందించిన, ఒక్కొక్క బిఎల్‌ఓల రెమ్యూనరేషన్‌లో రూ.500 కత్తిరింపు

**బండిఆత్మకూరురూరల్, మేజర్‌న్యూస్ :** సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి రెమ్యూనరేషన్ ఇవ్వడంలో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించడం శ్రీశైలం నియోజకవర్గం వ్యాప్తంగా చర్చ్ నియోజకవర్గ మారింది. మంగళవారం సూర్య దినపత్రికలో వచ్చిన “రెమ్యూనరేషన్ కొంతమందికేనా బి ఎల్ ఓ లకు ఇవ్వరా?” కథనానికి అధికారులు స్పందించారు. కానీ ఎన్నికలలో విధులు నిర్వహించిన బిఎల్‌ఓ లకు ఇవ్వాల్సిన రెమ్యూనరేషన్ లో హెూదా విధించారు. జిల్లా ఎన్నికల అధికారి ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఎన్నికల విధులు నిర్వహించిన ప్రతి బిఎల్‌ఓ కు రూ.2500 ఇవాల్సి ఉండగా కేవలం 2000 రూపాయలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. రెమ్యునరేషన్ విషయంలో ఆర్వో సుధారాణికి వివరణ అడగ్గా ఎలక్షన్ కమిషన్ నుండి నిధులు అందలేదని, నిధులు అందిన వెంటనే మిగిలిన రెమ్యునరేషన్ చెల్లిస్తామని చెప్పడం విశేషం. ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఇతర అధికారులకు పూర్తిస్థాయిలో రెమ్యూనరేషన్ ఇదివరకే అందజేసినట్లు సమాచారం. కానీ బి ఎల్ ఓలకు ఇచ్చే రెమ్యునరేషన్ లో అధికారులు కోత విధించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఐదు మండలాలలో దాదాపు 2026 మంది బిఎల్ ఓ లు ఎన్నికల


సూర్య

రెమ్యునరేషన్ కొందరికేనా...

బిఎల్‌ఓలకు ఇవ్వరా..?

విధులు నిర్వహించగా ఒక్కొక్కరి రెమ్యూనరేషన్ లో 500 కోత విధించడం విశేషం. ఇంకా బడ్జెట్ అందాల్సి ఉందని సి ఎఫ్ ఎం ఎస్ ద్వారా నిధులు జమ కాలేదని మరో అధికారి తెలపడంతో నిధులు విడుదల లేక ఇస్తారా లేక దాటే వేస్తారా అనే అపోహలు బిఎల్‌ఓ లలో ఏర్పడ్డాయి. మూలిగే నక్క పైన తాడిచెట్టు పడినట్లు తయారైంది ఎన్నికలలో బిఎల్ ఓ లుగా విధులు నిర్వహించిన విఆర్‌ఓ ల పరిస్థితి. ఉన్నతాధికారులకు రెమ్యూనరేషన్ అడగలేరు.ఒకవేళ తక్కువ రెమ్యూనరేషన్ ఇచ్చిన అధికారులను అడగలేని పరిస్థితి వారి వంతు అయింది. ఎన్నికలలో రాత్రింబవులు కష్టపడి ఎన్నికల విధులు నిర్వహించిన కష్టానికి తగ్గ ఫలితం దొరకలేదని ఉన్నత అధికారులు తమ శ్రమను దోపిడీ చేసుకున్నారని కొంతమంది బి ఎల్ ఓ లు విచారం వ్యక్తం చేస్తున్నారు.ఎన్నికల బడ్జెట్ విడుదల అయిందా లేక విడుదల కాలేదా అనే సందిగ్ధం లో ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులు అన్నారు.